# నమస్తే తెలంగాణ

# ఖమ్మం

5 | ఖమ్మం, సోమవారం 12 ఆగస్టు 2024 | KHAMMAM




ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం సొసైటీలో రుణమాఫీ జాబితాలో తన పేరును చూసుకుంటున్న రైతు (ఫైల్)

# కోతలు.. కొర్రీలు..

- రుణమాఫీ అర్హులకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి
- బ్యాంకులు, అధికారుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
- ఖమ్మంలో వ్యవసాయ శాఖకు 7,400 ఫిర్యాదులు
- భద్రాద్రి జిల్లాలో 660 మంది రైతుల అభ్యంతరాలు
- ఖమ్మం జిల్లా ప్రజావాణిలో మరో రెండు వేల అర్జీలు

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, ఆగస్టు 11 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పంటల రుణమాఫీ ప్రక్రియ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కోతలు, కొర్రీలతో కొనసాగుతోంది. పంట రుణాలు తీసుకున్న ప్రతి రైతుకూ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల తరువాత రుణమాఫీ ప్రక్రియకు శ్రీకారం చుట్టినప్పటికీ అన్నదాతలకు అనేక కొర్రీలు పెడుతోంది. దీంతో వేలాదిమంది రైతులు రుణమాఫీకి దూరమవుతున్నారు. ఫలితంగా రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైంది. ఈక్రమంలో నష్టనివారణకు దిగిన కాంగ్రెస్ ప్రభుత్వం అర్హత కలిగినప్పటికీ రుణమాఫీ రాని రైతులు టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొంది. గ్రామ, మండలస్థాయిలోనూ ఏఈవోలు, ఏవోల ద్వారా అర్జీలను స్వీకరిస్తోంది. దీంతో ఇప్పటి వరకు ఖమ్మం జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు సుమారు 7,400 ఫిర్యాదులు వచ్చినట్లు సదరు అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు మరో 2 వేలకు పైగా ప్రజావాణిలో రైతులు అర్జీలు పెట్టుకున్నారు. రేషన్‌కార్డులో ఇద్దరు పేర్లు ఉంటే ఒక్కరికే రుణమాఫీ వచ్చిందని, ఆధార్‌కార్డు నెంబర్ తప్పుకావడం, ఒకరి ఆధార్ నెంబర్ మరొకరి పేరుపై రావడం, రెండు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం ద్వారా సాంకేతిక సమస్య తలెత్తడం వంటి పలు కారణాలతో రుణమాఫీకి రైతులు దూరమవుతున్నట్లు తెలుస్తోంది. పంటల రుణమాఫీకి తమకు అర్హత ఉన్నప్పటికీ జాబితాలో తమ పేరు రాకపోవడానికి గల కారణాల కోసం బ్యాంకులు, సొసైటీల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. ఒకవైపు గ్రామాల్లో వ్యవసాయ పనులు జోరుగా ఉన్నప్పటికీ పనులు పక్కన పెట్టి మరీ రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతుండడం గమనార్హం.

## ఎడిట్ ఆప్షన్ ఇవ్వని ప్రభుత్వం..

రుణమాఫీకి సంబంధించి ఇప్పటి వరకు రెండు దఫాలుగా ప్రభుత్వం రుణమాఫీ నిధులను విడుదల చేసింది. ఖమ్మం జిల్లాలో తొలివిడతలో రూ.లక్షలోపు రుణాలున్న 57,857 మంది రైతులకు రూ.258.25 కోట్లు, రెండోవిడతలో రూ.లక్ష నుంచి 1.50 లక్షల్లోపు రుణాలున్న 33,942 మంది రైతులకు రూ.262.50 కోట్లు కలిపి రెండు విడతల్లో 91,799 మంది రైతులకు రూ.520.75 కోట్లు అందజేసింది. అయితే అర్హత ఉన్నప్పటికీ చిన్నపాటి సాంకేతిక కారణాల వల్ల పథకానికి దూరమైన రైతులు ఇంచుమించు జిల్లావ్యాప్తంగా 10 నుంచి 15 వేల వరకు ఉండవచ్చని అంచనా. అర్హత కలిగిన రైతులకు రుణమాఫీ వర్తించేందుకు గాను ఎడిట్ ఆప్షన్ వ్యవసాయ శాఖ అధికారులకు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కనీసం ఆధార్‌కార్డు నెంబర్‌ను సరిచేసే ఆప్షన్ కూడా లేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అర్జీలను తీసుకోవడం వరకే తమ బాధ్యత అంటూ బదులిస్తున్నారు.



రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేవంటూ ఏపీజీవీబీ ఖమ్మం రూరల్ బ్రాంచ్ అధికారులకు విన్నవిస్తున్న రైతులు (ఫైల్)

## భద్రాద్రి జిల్లాలో 660 అభ్యంతరాలు

రుణమాఫీపై రైతుల సందేహాల నివృత్తికి ప్రభుత్వం భద్రాద్రి జిల్లాలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఈ జిల్లాలో ఇప్పటివరకు 660 మంది రైతులు తమ ఫిర్యాదులను అందజేశారు. ప్రత్యేక ఫార్మాట్‌లో వ్యవసాయ శాఖ అధికారులు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. మండలాల్లో ఏవో, ఏఈవోలు, డివిజన్ స్థాయిలో ఏడీఏలు, జిల్లాస్థాయిలో డీఏవో పరిధిలో ఫిర్యాదుల సెల్‌ను ఏర్పాటు చేశారు.

## ఆధార్, రేషన్ కార్డుల సమస్యలే ఎక్కువ..

భద్రాద్రి జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 660 మంది రైతులు రుణమాఫీ రాలేదని ఫిర్యాదు చేశారు. మిగతా రైతులు మూడో జాబితాలో పేర్లు రాకపోతే ఫిర్యాదు చేయాలని ఆలోచనలో ఉన్నారు. ఎక్కువగా రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడం వల్ల రుణమాఫీ కాలేదని తెలిసింది. కొందరికి ఆధార్ కార్డులో ఉన్న నెంబర్‌కు అందులో ఉన్న పేరు తప్పుగా పడడం వల్ల కూడా రుణమాఫీ జరగలేదని తెలుస్తోంది. ఇంకా ఆధార్ కార్డులో పేర్లు లేకపోవడం, రేషన్ కార్డులు కొత్తవి ఇవ్వకపోవడం వల్ల కూడా రైతుల పేర్లు రుణమాఫీలో లేనట్లుగా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇక మూడో జాబితా ఎలా ఉంటుందో చూడాలి.

# పల్లెల్లో శ్రావణమాస బోనాలు..



బొడ్రాయి నుంచి బోనాలతో బయల్దేరుతున్న గ్రామస్తులు



ఖమ్మంలో బోనమెత్తిన మహిళలు



ఎంవీ పాలెంలో బోనాలను తీసుకొస్తున్న భక్తులు

**ఉమ్మడి జిల్లాలో శ్రావణమాస బోనాల జాతర మొదలైంది. దానితోపాడు ఆదివారం కూడా కలిసి రావడంతో వివిధ గ్రామాల్లో అమ్మవార్ల బోనాలతో పండుగ వాతావరణం నెలకొంది. ఆయా కాలనీ ప్రజలు తమ ఇళ్లకు మామిడి తోరణాలను కట్టుకొని అలంకరించుకున్నారు. మహిళలు ఉదయాన్నే ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక నైవైద్యాన్ని తయారుచేసుకున్నారు. ముందుగా గ్రామాల్లోని బొడ్రాయికి నీళ్లు పోసి పూజలు చేశారు. తరువాత ఆ బోనాలను తలలపై పెట్టుకొని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా బయలుదేరారు. గ్రామ పొలమేరలు, ఆలయాల్లోని అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.**

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్*

# భారీగా గంజాయి పట్టివేత

- భద్రాచలంలో 155 కిలోలు, ఇల్లెందులో 53 కిలోల స్వాధీనం
- ఖమ్మంలో ఎండు గంజాయి గుర్తింపు.. ముగ్గురి రిమాండ్..



ఇల్లెందు రూరల్: పట్టుకున్న గంజాయితో పోలీసులు

బూర్గంపహాడ్/ ఇల్లెందు రూరల్/ రఘునాథపాలెం, ఆగస్టు 11 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు ఆదివారం భారీగా గంజాయిని పట్టుకున్నారు. భద్రాచలంలో 155 కిలోలను, ఇల్లెందులో 53 కిలోలను, ఖమ్మంలో 450 గ్రాములను స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం ఘటనలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య కథనం ప్రకారం...భద్రాచలం బ్రిడ్జి సమీపంలో ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా తన సిబ్బందితో ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఆంధ్రా నుంచి పాల్వంచ వైపు ఓ ట్రాక్టర్ (ఆర్ బీటీ23113) వెళ్తోంది. ఈ ట్రాక్టర్‌లో గంజాయితో వస్తున్న స్మగ్లర్లు ఎక్సైజ్ పోలీసులను చూసి ట్రాక్టర్‌ను అక్కడే నిలిపివేసి పరారయ్యారు. సీఐ తన సిబ్బందితో ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా అందులో 155 కిలోల ఎండుగంజాయి లభ్యమైంది. ట్రాక్టర్‌తో పాటు గంజాయిని వారు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ పట్టుబడిన ఎండు గంజాయి విలువ రూ.39 లక్షలు ఉంటుంది. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్, సీఐ రహీమున్నీసా, ఎస్సై అల్లూరిసీతారామరాజా, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



బూర్గంపహాడ్: భద్రాచలంలో స్వాధీనం చేసుకున్న గంజాయి, ట్రాక్టర్‌తో ఎక్సైజ్ అధికారులు

## ఇల్లెందులో 53 కేజీలు..

వాహన తనిఖీల్లో భాగంగా ఇల్లెందులో పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నారు. ఇల్లెందు పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ చంద్రభాను ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. మండలంలోని డిగ్రీ కాలేజీ సమీపంలో శనివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా కొత్తగూడెం వైపు నుంచి ఓ కారు వస్తోంది. దానిని ఆపగా అందులో ఉన్న వ్యక్తి కారు డోర్ తీసుకొని పారిపోయాడు. కారును తనిఖీ చేయగా రూ.13 లక్షల విలువైన 53 కేజీల గంజాయి లభ్యమైంది. దీంతో అదే కారులో ఉన్న మిగతా నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వారు ఆ గంజాయిని మల్కాన్‌గిరి నుంచి ఉత్తరాకాండ్‌కు తీసుకెళ్తున్నారు. వారు తరలిస్తున్న గంజాయిని, కారును, మూడు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లలిత్ మోహన్, ప్రేమ్ వీర్ సింగ్, రాజ్‌కుమార్, అమృతపాల్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరిని కోర్టు రిమాండ్ చేయనున్నారు. సీఐ బత్తుల ప్రవీణ్‌కుమార్, ఎస్సై సూర్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖమ్మంలో నిందితుల రిమాండ్..

మద్యానికి బానిసై గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు యువకులను ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ భానుప్రకాశ్ ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖమ్మం కైకొండాయిగూడేనికి చెందిన గద్దల రాకేశ్, రాజీవ్‌నగర్ గుట్టకు చెందిన చల్లా గోపి, యూపీహెచ్ కాలనీకి చెందిన పులి ధనుష్‌లు మద్యానికి అలవాటు పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని డొంకరాయి, కాకినాడ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు సీపీ సునీల్‌దత్ ఆదేశాలతో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఖానాపురం హవేలీ ఎస్సై అలీం హుస్సేన్ తన సిబ్బందితో కైకొండాయిగూడెంలోని ఓ ఇంటిపై దాడి చేసి పట్టుకున్నారు. దాడి సమయంలో 430 గ్రాముల ఎండు గంజాయిని గుర్తించారు. మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ చేశారు.

# ‘సీతారామ’ను రెండేళ్లలో పూర్తిచేస్తాం

- ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పూర్తిస్థాయిలో సాగునీళ్లు అందిస్తాం
- పూసుగూడెం రెండో పంపుహౌస్ ట్రయల్ రన్ ప్రారంభంలో మంత్రి ఉత్తమ్
- టన్నెల్ పూర్తయితే పాలేరుకు గోదావరి జలాలు: మంత్రి తుమ్మల
- ఎనిమిది నియోజకవర్గాలకు ‘సీతారామ’ నీళ్లు: మంత్రి పొంగులేటి



ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి



వైరాలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ములకలపల్లి/ వైరా టౌన్, ఆగస్టు 11 : సీతారామ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పూర్తిస్థాయిలో సాగునీళ్లు అందిస్తామని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భూసేకరణ, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులను యుద్ధప్రాతిపదికన చేపడతామన్నారు. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి తరఫున తాను మాట ఇస్తున్నట్లు చెప్పారు. సీతారామ ప్రాజెక్టు పనులను తమ ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా తీసుకుందని అన్నారు. ఈ నెల15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో పర్యటించి సీతారామ ప్రాజెక్టు రెండు, మూడు పంపుహౌస్‌లను ప్రారంభించనున్న నేపథ్యంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో పర్యటించి సీతారామ ప్రాజెక్టు పనులను, సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత భద్రాద్రి జిల్లాలో పర్యటించిన మంత్రులు.. ములకలపల్లి మండలం పూసుగూడెం సమీపంలోని వీకే రామవరం వద్ద సీతారామ ప్రాజెక్టు రెండో పంపుహౌస్ ట్రయల్ రన్‌ను స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. అనంతరం కమలాపురం వద్ద మూడో పంపుహౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన అధికారుల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పూసుగూడెం వద్ద రెండో పంపుహౌస్ ట్రయల్ రన్ విజయవంతమైనట్లు చెప్పారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఉపయోగపడే సీతారామ ప్రాజెక్టు పనులను పనులు నత్తనడకన కొనసాగాయన్నారు. ఇక ముందు ఉమ్మడి జిల్లా ఆయకట్టుకు కృష్ణా జలాలు సకాలంలో రాకపోతే ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో వైరా లింక్ కెనాల్ ద్వారా గోదావరి నీళ్లను అందిస్తామని వివరించారు. జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తయితే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయన్నారు. అనంతరం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లా రైతుల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు. అయితే ఉమ్మడి జిల్లాలో భద్రాచలం, ఇల్లెందు మినహా మిగతా ఎనిమిది నియోజకవర్గాలకూ సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందుతాయని వివరించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ప్రభుత్వ ముఖ్య సలహదారుడు పెంటారెడ్డి, ఎస్పీ రోహిత్‌రాజ్, నీటిపారుదలశాఖ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, స్పెసల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్, నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ములకలపల్లి: పూసుగూడెం రెండో పంపుహౌస్ నుంచి ఉరకలేస్తూ వస్తున్న గోదావరి జలాలు

## 15న జిల్లాలో సీఎం పర్యటన

ఈ నెల 15న సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆ రోజున ములకలపల్లి మండలంలో సీతారామ ప్రాజెక్టు రెండు, మూడు పంపుహౌస్‌ల ప్రారంభిస్తామని, వైరా మండలంలో రుణమాఫీ రైతుసదస్సులో ప్రసంగిస్తారని తెలిపారు. ఈ మేరకు వైరాలోని రైతు సదస్సు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంతో ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతుల చిరకాల వాంఛ నెరవేరుతోందని అన్నారు. గోదావరి జలాలు సాగర్ ఆయకట్టుకు చేరనున్నాయని అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు చివరి భూములకు సాగర్ నీళ్లు రాని సమయంలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను తీసుకొని వచ్చి ఏన్కూరు ఎన్ఎస్‌పీకి అనుసంధానం చేసి 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

## నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన...

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోమవారం భద్రాద్రి జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి డిప్యూటీ సీఎం జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా సోమవారం ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ జితేశ్ తెలిపారు.

### అస్తవ్యస్తంగా ఎస్సారెస్పీ కాల్వలు


# కాల్వనిండా చెట్లు.. నీరు పారేదెట్లా?

- దట్టంగా పెరిగిన చెట్లు.. ముందుకుపారని నీరు
- చెట్లు తొలగించకుండానే నీటిని విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- చెరువులకు చేరని సాగర్ జలాలు
- భక్తరామదాసు ఎత్తిపోతల పథకం అభాసుపాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- కొన్నిచోట్ల కర్షకులే కాల్వలను శుభ్రం చేసుకుంటున్న వైనం

**తిరుమలాయపాలెం మండలంలోని ఎస్సారెస్పీ కాలువలు చీమలు దూరని చిట్టడవి.. కాకులు దూరని కారడవిని తలపిస్తున్నాయి. దట్టమైన చెట్లతో నిండిపోయి నీరు ముందుకుపారని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎస్సారెస్పీ కాల్వల్లో పెరిగిన చెట్లను తొలిగించకుండానే ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా పాలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. అయితే ఆ సాగర్ జలాలు తమ చెరువుల్లోకి చేరుతాయో లేదోనని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి చెరువులూ నిండకా.. ‘భక్తరామదాసు’ నీళ్లూ రాక తమ భూములు బీళ్లుగా మారతాయని ఆవేదన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు కాల్వల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో కొన్నిచోట్ల రైతులే స్వతహాగా తమ పరిధిలోని కాల్వలను జేసీబీల సహాయంతో శుభ్రం చేసుకుంటున్నారు.**


**- తిరుమలాయపాలెం, ఆగస్టు 11**






తిరుమలాయపాలెం: కొక్కిరేణి స్టేజీ సమీపంలో ఎస్సారెస్పీ 20ఎల్ కాల్వలో దట్టంగా పెరిగిన చెట్లు

ఖమ్మంజిల్లాలో అత్యంత కరువుపీడిత ప్రాంతమైన తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాలతోపాటు పాలేరు నియోజకవర్గానికి సాగునీటి వసతి కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ‘భక్తరామదాసు’ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. పాలేరు రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కరువు నెలల్లో పారించింది. పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు ముదిగొండ, మహబూబాబాద్ జిల్లా మరిపెడ, గాలివారిగూడెం గ్రామాలతో కలిపి మొత్తం 75వేల ఎకరాలకు సాగునీరు అందించింది. గత ఏడేళ్లుగా భక్తరామదాసు ఎత్తిపోత్తల పథకం ద్వారా ఈ ప్రాంత రైతులు వరి రెండు పంటలు పండించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సారెస్పీ కాల్వల్లో పెరిగిన చెట్లను తొలిగించకుండానే ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శ్రీభక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువుల్లోకి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాల్వల్లో నీటి సరఫరా ఇబ్బందికరంగా మారింది. మరిపెడబంగ్లా సమీపంలో 045 కిలోమీటరు నుంచి తల్లంపాడు 071 కిలోమీటరు వరకు డీబీఎం-60 మెయిన్‌కెనాల్‌లో చెట్లు పెరిగాయి. దీంతో నీటి ప్రవాహం ఆలస్యంగా జరుగుతున్నది. కాల్వల్లో పెరిగిన చెట్ల వలన కొండాపురం స్టేజీ సమీపంలో కాల్వల్లో నీరు పొర్లుతున్నది. మండలంలోని కొక్కిరేణి స్టేజీ సమీపంలోని 20ఎల్ కాల్వలో విపరీతమైన చెట్లు పెరగడంతో నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో ఖమ్మంరూరల్ మండలంలోని చింతపల్లి, ఆరెకోడు, వెంకటాయపాలెం, కాశిరాజిగూడెం, గోళ్లపాడు తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి శ్రీభక్తరామదాసు ఎత్తిపోతల పథకం నీరు ప్రవహించే పరిస్థితి లేకుండా పోయింది. తిరుమలాయపాలెం మండలంలోని వెదుళ్లచెరువు, తిరుమలాయపాలెం, బీచరాజుపల్లి, రమణతండా ప్రాంతంలోని చెరువులు నింపే కాల్వ సైతం అసంపూర్తిగానే ఉండడంతో ఆ ప్రాంతంలోకి నీటి సరఫరా కావడం లేదు. భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు పారుతున్న డీబీఎం-60 మెయిన్ కెనాల్‌తోపాటు 35 ఓటీలు, మైనర్ సబ్‌మైనర్ కాల్వల్లోనూ చెట్లు పెరిగి నీటి సరఫరాకు ఆటంకంగా మారింది. ప్రభుత్వం మంత్రులు చొరవ తీసుకొని ఎస్సారెస్పీ కాల్వల్లో చెట్లను తొలిగించి పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో చెరువుల్లో నింపే అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.



రఘునాథపాలెం చెరువులోకి నీరు వెళ్లేందుకు జేసీబీలతో కాలువను శుభ్రం చేస్తున్న రైతులు

### కాల్వల్లో చెట్లను తొలగించాలి



ఎస్సారెస్పీ కాల్వల్లో చెట్లు విపరీతంగా పెరిగాయి. లిఫ్ట్ ద్వారా నీళ్లు విడుదల చేశారు గానీ చెట్ల అడ్డు వల్ల నీరు పారడం లేదు. చింతపల్లి ప్రాంతానికి నీరు ప్రవహించే కాల్వలో నీరు వచ్చే పరిస్థితి అసలే లేదు. తిరుమలాయపాలెం, వెదుళ్లచెరువు ప్రాంతంలోని చెరువుల్లోకి నీరు తరలించే కాల్వ తవ్వాలి. ‘భక్తరామదాసు’ ద్వారా అన్ని చెరువులు నింపాలి.

**– కొలిచం స్వామి, రైతు, తిరుమలాయపాలెం**

### పనులు ప్రారంభించాం..

భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా పాలేరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోకి నీటి సరఫరా జరుగుతున్నది. కొన్ని ప్రాంతాల్లో కాల్వల్లో చెట్లు పెరిగాయి. మరిపెడ బంగ్లా వద్ద నుంచి డీబీఎం-60 మెయిన్ కెనాల్‌లో చెట్ల తొలగింపు ప్రారంభించాం. అన్ని ప్రాంతాల్లో పూర్తిచేస్తాం. ఖమ్మంరూరల్ మండలానికి నీరు సరఫరా జరిగే 20 ఎల్ కాల్వలోనూ చెట్లు తొలిగించి నీరు సరఫరా చేస్తాం. మండలంలోని వెదుళ్ల చెరువు ప్రాంతానికి నీరు సరఫరా జరిగే కాల్వ తవ్వకాన్ని ప్రారంభించాం. కాల్వ తవ్వకం పూర్తిచేసి ఆయా ప్రాంతంలోని చెరువులను నింపుతాం.

**– బానాల రమేశ్‌రెడ్డి, ఐబీ డీఈఈ**